www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 ఏప్రిల్ 2023
5
తిరుపతి

కొత్తపాలెంలో గోడౌన్ల గుర్తింపు పూర్తి : కలెక్టర్

తిరుపతి టౌన్ : రానున్న 2024 సంవత్సరంలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలు 2024 సందర్భంగా కొత్తగా తయారు చేసిన బెల్ ఎం3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వివి ప్యాట్‌లను భద్రపరిచేందుకు గోడౌన్లను గుర్తించి ప్రతిపాదనలను వెంటనే పంపాలని ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశాల మేరకు గోడౌన్లను గుర్తించినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. ముఖేష్‌కుమార్ మీనా 13 కొత్త జిల్లాల కలెక్టర్లతో విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్‌నుంచి కె.వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. భద్రపరిచే గోడౌన్లను గుర్తించి ప్రతిపాదనలను ఏప్రిల్ 12న అందేలా పంపాలని తెలిపారని, గోడౌన్లు పటిష్టంగా ఉండేలా, వర్షానికి నీరు కారేలా ఉండరాదని, భద్రతా లోపాలు లేకుండా ఉండాలని సూచించారు. రేణిగుంట మండలం కొత్తపాలెం గ్రామ పరిధిలోని సెంట్రల్ వేర్‌హౌసింగ్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి గోడౌన్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నిబంధనల మేరకు ప్రమాణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిలదీత

- గంగమ్మ జాతరకు రూ.25 లక్షలు కేటాయింపు
- విలీనమైన శెట్టిపల్లి అభివృద్ధికి రూ.2 కోట్లు
- 104 అంశాలతో తిరుపతి కౌన్సిల్లో చర్చ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిలో తాగునీటి సమస్యపై అధికార పార్టీ కార్పొరేటర్ నరసింహాచారి నిలదీశారు. వేసవి రాకముందే తాగునీటి సమస్య నివారణకు ఎందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు మోటార్లు రిపేర్ చేయలేదని, లీకేజికి గురవుతున్న పైప్‌లైన్ ఎందుకు మార్చలేదని ఇంజినీరింగ్ అధికారులను నిలదీసినా వారి నుంచి సరైన సమాధానం రాలేదు. తక్షణం తాగునీటి సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి కౌన్సిల్ సాధారణ సమావేశం 104 అంశాలతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలవరకూ సాగింది. కార్పొరేటర్ ఎస్‌కె బాబు మాట్లాడుతూ తిరుపతిలో ఉన్న లెప్రసి కాలనీ, యానాది కాలనీ పేర్లు మార్చాలని డిమాండ్ చేశారు. టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ మాట్లాడుతూ గంగమ్మ జాతర రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించాలని కోరారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఇతర అంతర్గత రోడ్లు వేసేలా అజెండాలో పొందుపరిచారు. వీటితో పాటు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 25 లక్షలు, టిటిడినుంచి 50 లోలు, తుడా నుంచి నిధులు తీసుకుని వైభవంగా నిర్వహించాలని కౌన్సిల్ నిర్ణయించింది. 50 డివిజన్లకు బడ్జెట్ తరహాలో నిదులు కేటాయించారు. కౌన్సిల్ ఆద్యంతం అధికార పార్టీ కార్పొరేటర్లు మాస్టర్‌ప్లాన్ రోడ్లపై పొగడడానికే సమయం ఎక్కువ తీసుకున్నారు తప్ప, ప్రజా సమస్యలపై మాట్లాడింది తక్కువేనని చెప్పవచ్చు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, వేదికపై మేయర్ శిరీష, కమిషనర్ హరిత

మాస్టర్‌ప్లాన్ రోడ్లు భేష్ : ఎంఎల్ఎ

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో చేపట్టిన 13 మాస్టర్ ప్లాన్ రోడ్లు వలన తిరుపతి అభివృద్ధి ఉహించని రీతిలో జరిగి తిరుపతికి ప్రతిష్టను పెంచడం జరుగుతుందన్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామికి స్వయాన చెల్లెలైన తిరుపతి గంగమ్మ జాతరను పెద్ద ఎత్తున జరుపుకుందామని పిలుపునిచ్చారు. తిరుపతి నగరంలో రూపుదిద్దుకుంట్టున్న రహదారులకు, స్థలాలకు మహనీయులైన వారి పేర్లను పెట్టడం చాలా శుభపరిణామమని తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో డివిజన్లలో అత్యవసరమైన పనులను చేపట్టుటకు కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించడం జరిగిందన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ తిరుపతి అభివద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యే భూమన వెంటే తామంతా వుంటూ అభివద్ధి వైపు పయనిస్తామన్నారు. తిరుపతి మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే అంశాన్ని తదుపరి కౌన్సిల్ సమావేశానికి తీసుకొచ్చి వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్లకు ముద్రనారాయణ విజ్ఞప్తి చేసారు. స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్.కె.బాబు మాట్లాడుతూ పాత వెంకటేశ్వర థియేటర్ వద్దనున్న రైల్వే లైన్ పై ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.

శెట్టిపల్లి అభివృద్ధికి రూ.2 కోట్లు

తిరుపతిలో విలీనమైన శెట్టిపల్లి ప్రాంతంలో 2 కోట్లతో సిమెంట్ రోడ్లు, కాలువలు, నీటి సదుపాయం కోసం కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మునిరెడ్డి ఆర్చ్ నుండి ముత్యాల రెడ్డి పల్లి సర్కిల్ వరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి 1 కోటి 86 లక్షలతోనూ, అదేవిధంగా మునిరెడ్డి ఆర్చ్ నుండి మహిళా యూనివర్సిటీ వరకు 80 అడుగుల రోడ్డును అభివద్ధి పరిచేందుకు 1 కోటి 72 లక్షలతో రోడ్లు నిర్మించేందుకు ఆమోదం తెలిపారు. తెలుగుగంగ మంచి నీటిని సరఫరా చేయు పంప్ హౌస్‌లనందున్న మోటర్ పంపులు, సాఫ్ట్ స్టార్టర్స్, కేబుల్ వైర్లు, అదేవిధంగా మంగళం పంప్ హౌస్, ఎం.డి.పుత్తూరు పంప్ హౌస్ నందు వున్న పంపులు పాడైనందున కొత్తవి ఏర్పాటుకు 1 కోటి 90 లక్షలతో కొత్తవి ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. నగరంలో వీధి కుక్కలను పట్టి వాటికి శస్త్రచికిత్స చేయించి, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించుటకు ఒక్కొక్క కుక్కకు 1200 రూపాయలు చెల్లించు పద్ధతిపై ఒక సంవత్సరం పాటు పని చేయించుటకు అనిమల్ కేర్ ల్యాండ్ వారికి అనుమతిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని మేయర్ శిరిష, కమిషనర్ హరిత తెలిపారు.

వడగాల్పుల 'భగభగ'లు

- 18-21 తేదీల్లో 50 డిగ్రీల చేరువలో..
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

వాతావరణంలో మార్పులు ఉడుకెక్కుతున్నాయి.. భానుడు తన ప్రతాపాన్ని భగభగ చూపిస్తున్నాడు. గత ఏడాదితో పోలిస్తే ఆరేడు డిగ్రీలు పెరిగి విలవిలలాడే పరిస్థితి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో సామాన్య, మధ్యతరగతి పేద ప్రజలు బతుకుబండిని లాగడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎండాకలంలో ఎండలు సహజం. అయితే పచ్చదనం తగ్గిపోవడం, పర్యావరణంలో అసమానతల వల్ల వేడి భయంకరంగా ఉంటోందని వాతావరణ అధ్యయన అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి పేరుతో వందల సంవత్సరాల క్రితం చెట్లను తొలగించడమూ, తొలగించిన ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటకపోవడం కారణంగా చెప్పవచ్చు. తట్టుకోలేని వేడిలోనే బతుకు జీవనం కోసం సామాన్య బతుకు వ్యథలపై పరిశోధనాత్మక కథనం మీకోసం..

గత ఏడాది, ప్రస్తుతం ఏప్రిల్ నెలల్లో ఉష్ణోగ్రతల వ్యత్యాసం

తేదీ	గత ఏడాది (2022) (గరిష్టం-కనిష్టం)		ప్రస్తుతం (2023) (గరిష్టం-కనిష్టం)	
12వ తేది	35	28	41	23
13వ తేది	35	28	41	24
14వ తేది	36	27	41	23
15వ తేది	37	28	41	24
16వ తేది	37	29	41	23
17వ తేది	36	28	43	24
18వ తేది	36	28	46	24
19వ తేది	37	27	46	25
20వ తేది	36	28	47	25
21వ తేది	36	27	45	26

పండ్ల ధరలు 70 శాతం పెరిగాయి

రెండు వేల సంవత్సరం నుండి పండ్లు, జ్యూస్ అమ్ముకొంటున్నాను. కాని ఆ రోజు వాతావరణానికి ఈ వాతావరణానికి చాలా తేడా ఉండి. అప్పుడు చెట్లు బాగానే ఉన్నాయి. చెట్ల కింద నీడలో చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నాము. కాని నేడు జనాభా పెరిగారు. పండ్ల ధరలు నాటికి నేటికి 70 శాతం పెరిగాయి. 70 రూపాయలున్న ఆపిల్ 150, 180, 210 వరకు, దానిమ్మ గతంలో 100 రూపాయలుంటే నేడు 250కు చేరుకుంది. ఎండలున్నా జ్యూస్ వ్యాపారం సరిగా లేదు. ముందు కరెంటు బిల్లు 2 వేలు వస్తే నేడు 8 వేలు వస్తోంది. గిట్టుబాటు లేకపోయినా కుటుంబాన్ని పోషించడం కోసం బతుకు బండిని లాగుతున్నాను. **- మల్లిఖార్జున, పండ్ల వ్యాపారి, తిరుపతి నగరం.**

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండలు అధికమవ్వడంతో చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే వారు తగిన జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. ఎండల తీవ్రత దృష్ట్యా యోగాలోని శీతల ప్రాణాయామం ద్వారా కూడా వడదెబ్బకు గురి కాకుండా ఉండొచ్చు. హోమియోపతిలో నెట్రమ్మూర్30 మందు ద్వారా కూడా ఎండల్లో బతుకు జీవనం సాగించే వారు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తపడొచ్చు. **-డాక్టర్ ప్రసన్నలక్ష్మి, మెడికల్ ఆఫీసర్, మంగళం హోమియోపతి వైద్యశాల**

కోళ్లు చనిపోతున్నాయి

ఎండలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కోళ్లను ఎక్కడెక్కడి నుండో తీసుకొస్తారు. ట్రాన్స్‌పోర్టులో తెల్లవారుజాములోపు వచ్చి కోళ్ళను దింపుతారు. ఈ క్రమంలో దింపుతున్న సమయంలో అంతా బాగానే ఉన్నా పొద్దెక్కేసరికి కొన్ని కోళ్లు చనిపోతున్నాయి. దీంతో నష్టం వాటిల్లుతుంది. ఇటీవల దాదాపు 10 కోళ్లు చనిపోయాయి. అధిక ఉష్ణోగ్రతలతో భయ పడుతున్నాము **-తలారి చంద్రశేఖర్, చికెన్ షాపు నిర్వాహకుడు, మంగళం.**

చెట్లుంటే సల్లగా ఉంటుంది

మా సొంతూరు నెల్లూరు. 20 ఏళ్ళకింద తిరుపతికి వచ్చాను. ఆనాటి వాతావరణ పరిస్థితులు ఇప్పుడు పరిస్థితులు చాలా తేడా ఉంది. నేను చేసే పని బండలు కోయడం. ఒక్కోసారి ఎండలోనే పనిచేయాల్సి వచ్చేది. అప్పుడనుకునే వాడ్ని చెట్లుంటే సల్లగా ఉండేదని. కాని చాలా చోట్ల చెట్లు కొట్టేస్తాండారు. కాని బతుకు బండి లాగడానికి ఎదో ఒక పనిచేయ్యాలి కదా- **నారాయణ, గృహనిర్మాణ కార్మికుడు, అన్నారావు సర్కిల్, తిరుపతి.**

శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి దేశానికి ఆదర్శం

కేంద్రమంత్రి హార్దీప్ సింగ్

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఒక దేశ అభివృద్ధిలో ప్రజల ఆరోగ్య సంరక్షణ, విద్య రెండు కీలకమైనవని, శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయ ఆసుపత్రి దేశానికే ఆదర్శమని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల, పెట్రో లియం, సహజ వనవరుల శాఖ మంత్రి హార్దీప్‌సింగ్ తెలిపారు. శ్రీవారి దర్శనా నంతరం మంగళవారం ఆయన టిటిడి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయాన్ని, బర్డు ఆసుపత్రులను సందర్శించారు. చిన్నపిల్లల హృదయాలయ ఆసుపత్రులో వార్డుల్లో గుండెజబ్బులతో చికిత్స పొందుతున్న చిన్నారులను, క్యాథ్ ల్యాబ్, ఐసీయు తదితర వార్డులను సందర్శించి, రోగుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు చేసి బాలింతలకు, చిన్నారులకు టిటిడి అందిస్తున్న సేవల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం బర్డు ఆసుపత్రిని సందర్శించి నిరుపేదలకు ఉచితంగా మోకాలి కీళ్ల మార్పిడి, ఇతర ఎముకల సంబంధిత వ్యాధులకు అందు తున్న చికిత్సలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాబార్గవి, డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, డాక్టరు గణపతి, డాక్టరు రామమూర్తి, డాక్టరు ప్రదీప్, డాక్టరు వేణుగోపాల్, ఈఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆదాయం ఒక్కరోజే రూ.5.16 కోట్లు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో వేసవి నేపథ్యంలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.16 కోట్లు భారీగా వచ్చినట్లుగా టిటిడి పేర్కొంది. తాజాగా అందిన సమాచారం మేరకు టికెట్లు ఉండేవారికి త్వరగానే దర్శనం అవుతోంది. అయితే ఎటువంటి టోకెన్లు లేని వారికి మాత్రం 20 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం ఐదు కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం ఒక్కరోజు వెంకటేశ్వర స్వామిని మొత్తం 69,781 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇందులో 27552 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు.

తిరుమలలో పాదరక్షలు భద్రపరచు కౌంటర్ ప్రారంభం

కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఈవో ఎవి ధర్మారెడ్డి

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాదం కాంప్లెక్స్, ప్రధాన కళ్యాణ కట్ట కాంప్లెక్స్‌లలో పాదరక్షలు భద్రపరచు కౌంటర్లను మంగళవారం సాయంత్రం టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ, తిరుమలకు విచ్చేసే భక్తుల పాదరక్షల భద్రపరచడానికి టిటిడి పలు ప్రాంతాల్లో కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈరోజు రెండు కౌంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కౌంటర్లలో భక్తులు నంబర్ ఉన్న బ్యాగ్‌లను తీసుకొని పాదరక్షలను ఉంచి, దారంతో కట్టి, అదే నంబర్ ఉన్న రాక్‌లో తిరిగి ఉంచాలన్నారు. భక్తుడికి ర్యాక్ - బ్యాగ్‌తో సమానమైన నంబర్‌తో టోకెన్ జారీ చేయబడుతుందన్నారు. భక్తులు తిరిగి వచ్చిన తర్వాత టోకెన్ ఇచ్చి వారి పాదరక్షలను తిరిగి పొందుతారని తెలిపారు. శ్రీవారి సేవకుల ద్వారా టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం వద్ద 1187 ర్యాక్‌లు, ప్రధాన కల్యాణ కట్ట వద్ద 4 వేల ర్యాక్‌లను భక్తుల కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. త్వరలో పిఎసి - 1,2,3, నారాయణగిరి క్యూ లైన్లు, రాంభాగీచా, సుపదం, ఏటీసీ సర్కిల్, వీక్యూసీలో పాదరక్షల భద్రపరుచు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, కల్యాణకట్ట, అన్నప్రసాదం డిప్యూటీ ఈవో సెల్వం, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి పాల్గొన్నారు.

తెలుగు, సంస్కృత అకాడమీ పేరుతో వెబ్‌సైట్స్

- మాతృభాష నేర్చుకునేందుకు ఆడియో, వీడియోలు
- తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

తెలుగు, సంస్కృత అకాడమీ పేరుతో వెబ్‌సైట్స్ అందుబాటులోకి తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి చెప్పారు. పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అలాగే తెలుగు భాష నేర్చుకునేందుకు ఆడియో, వీడియోలు తయారు చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం తుమ్మలగుంటలోని ఎస్వీ గోశాల ఆవరణంలో ఉన్న తెలుగు, సంస్కృత అకాడమీ ప్రాంతీయ కేంద్రంలో లక్ష్మీపార్వతి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు అకాడమీ స్థాపించిన తరువాత పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం జనరల్ స్టడీస్, సైన్స్ అండ్ టెక్నాలజీ పుస్తకాలను ముద్రించడం జరిగిందని, వీటితో పాటు ఏ.పి, ఇండియన్ ఎకానమీ పుస్తకాలు త్వరలో ముద్రించడం జరుగుతుందని తెలిపారు. బి.ఈ.డి సెమ్-1, సెమ్-3 కి సంబంధించిన పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారితో ఒప్పందం కుదుర్చుకొని త్వరలో డిగ్రీ పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తెలుగు మాత భాష కాని వారు, తెలుగు రాని వారి కోసం లెర్న్ తెలుగు పుస్తకాలు ఆడియో, వీడియో సి.డి.లు రూపొందించే దిశగా అకాడమీ కషి చేస్తుందన్నారు. తెలుగు అకాడమీ రూపొందించిన ప్రచురణలు ఈ-కామర్స్ పోర్టల్ ద్వారా హోల్‌సేల్, రిటైల్ సేల్‌లో నిర్వహించడానికి ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ముద్రించిన పుస్తకాలన్నింటిని తిరుపతి, అనంతపురం, విజయవాడ, గుంటూరు, విశాఖపట్టణం, ప్రాంతీయ కేంద్రాల ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం మాతభాషా దినోత్సవం, ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని తెలుగు భాష కోసం కషిచేసిన మహనీయులకు పురస్కారాలు అందించడం జరుగుతుందని, సంస్కత అకాడమీ ద్వారా ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి ఒక సంస్కత కవికి సంబంధించిన జన్మదినం, రచనలకు సంబంధించిన విషయాలపై ఒక కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కొంత మంది సైబర్ నేరస్తులు తెలుగు, సాంస్కతిక అకాడమీ పేరు మీద నకిలీ వెబ్ సైట్ ను తయారు చేసి నిరుద్యోగులకు అవకాశాలు, అకాడమీ పోస్టులు పడుతున్నాయని ధరఖాస్తు చేసుకోమని వస్తున్న వార్తలు అవాస్తవమని తెలిపారు. ఈ వార్తల పై విజయవాడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని అన్నారు. తెలుగు భాషను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే ఉద్దేశంతో తెలుగు మాండలికం పుస్తకమును ప్రతి జిల్లాలో ముద్రించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు, సంస్కత అకాడమీ రీసెర్చ్ అసిస్టెంట్ ఎస్.టి.ఎ. రాజ్యలక్ష్మి, రవిప్రసాద్, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

ఘనంగా కస్తూర్బా జయంతి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు, వైఎస్ఆర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డులోని ఆ సంస్థ కార్యాలయంలో కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు ఛైర్మన్ పిసి రాయల్ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వైఎస్ఆర్ ట్రస్టు, కస్తూర్బా ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్నదానం, వస్త్రదానం, వైద్యశిబిరాలు, ట్రైసైకిల్స్ పంపిణీ, ఇతరత్రా సేవా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాదీ కస్తూర్బా ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు లక్ష రూపాయలు కేటాయించి, నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్టు సభ్యులు రుద్రరాజు శ్రీదేవి, రామచంద్రారెడ్డి, సిబ్బంది జి.రామకృష్ణ, అపూర్వ, లావణ్య, స్పందన, మణి, లక్ష్మీపతి, మురళీకృష్ణ, జి.కృష్ణ, రామకృష్ణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన బస్సు ప్రమాదం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుపతి నుంచి కల్లూరు వెల్లుతున్న ఆర్‌టిసి బస్సుకు మంగళవారం ఉదయం తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు తిరుపతి-కల్లూరు వెళ్లుతున్న ఆర్‌టిసి బస్సు చెర్లోపల్లి సమీపంలోని పుదిపట్ల వద్దకు రాగానే బస్సు ముందుభాగంలో ఉన్న టైరు పేలడంతో బస్సు పెద్ద కుదుపుకు గురైంది. బస్సు డ్రైవరు చాకచాక్యంగా ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించి, సైడ్‌కాలవలోకి బస్సును వెళ్లనీకుండా రోడ్డుపక్కన నిలిపివేశాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణీకులు ఎలాంటి గాయాలు లేకుండా తప్పించుకున్నారు. అదే సమయంలో బస్సు రైట్‌కు వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొన్నా, ఎడమవైపు డ్రైనేజిలోకి పడిన ప్రయాణీకులకు చాలా ప్రమాదం సంభవించేది. చాకచాక్యంగా వ్యవహరించిన డ్రైవరను ప్రయాణీకులు అభినందించారు. బస్సుల్లో సేఫ్టీ టైరు ఉన్నా టైరు మార్చేందుకు అవసరమైన టూల్స్ లేకపోవడంతో డిపో నుంచి పరికరాలు వచ్చే వరకు ప్రయాణీకులు రోడ్డుపై గంటకుపైగా నిరీక్షించారు.

సామాజిక న్యాయ వైతాళికుడు

జ్యోతిరావ్ పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

సామాజిక న్యాయ వైతాళికుడు జ్యోతిరావ్‌పూలె అని, కులవివక్షకు వ్యతిరేకంగా, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పూలే కృషి చేశారని వక్తలు ఉద్ఘాటించారు. పూలే జయంతి పురస్కరించుకుని తిరుపతి బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి సిపిఎం నేతలు నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ సామాజిక తరగతులలో వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఉండాలని ఆనాడే చెప్పారన్నారు. తన భార్య సావిత్రి బాయికి విద్యను నేర్పించడమే కాకుండా, మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది పాఠశాలను ఏర్పాటు చేయించారన్నారు. బ్రాహ్మణవాదానికి వ్యతిరేకరంగా, కులనిర్మూలన కోసం పాటుపడిన మహోన్నతమైన వ్యక్తని కొనియాడారు. పూలే ఆశయాలను బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు పి.బుజ్జి, ఆర్.లక్ష్మి, ఎన్.మాధవ్, ఎం.జయంతి, కె.వేణు, పి.మునిరాజా, ఎ.రాధాక్రిష్ణ, పి.రమేష్ బాబు, చినబాబు, డి.పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో సిపిఎం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, గోపి పాల్గొన్నారు. కెవిబిపురంలో సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో రాగిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిపారు. సత్యవేడు బీసీ బాలుర హాస్టల్లో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం, సిఐటియు నాయకులు రమేష్, బీసీ హాస్టల్ వార్డెన్ గంగాధర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. గూడూరులో సిపిఎం నాయకులు జోగి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. రేణిగుంట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరమణ, ఈశ్వరి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళి అర్పించారు.

సామాజిక న్యాయ వైతాళికుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని తిరుపతి ఎంపి గురుమూర్తి కొనియాడారు. కుల,లింగ వివక్షకు తావు లేకుండా అందరికీ విద్య, సమానత్వం ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే విశ్వాసాన్ని నమ్మిన గొప్ప మేధావి అని ఆయన అన్నారు. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష పూలమాల వేసి నివాళి అర్పించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని నేర్పించిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ యు.శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు డి.ఎస్. వరకుమార్ కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని, కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్ పాల్గొన్నారు. మహతి ఆడిటోరియంలో పూలే జయంతి వేడుకలకు తెలంగాణా సాహిత్య అకాడమీ అధ్యక్షులు గౌరీశంకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జర్నలిజం అధ్యపకులు శ్రీనివాస్, బహుజన సమాఖ్య సంఘటన అధ్యక్షులు ప్రీతిహారీత్, టిటిడి డిప్యూటీ ఈవోలు స్నేహలత, లోకనాథం, ఆనందరాజు, జగదీశ్వరి, అశ్విని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు కుసుమకుమారి, ఈఈ మనోహరం పా ల్గొన్నారు.

టిడిపి అధ్యర్యంలో మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్‌సి మునిక్రిష్ణ నివాళి అర్పించారు. ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం పూలమాల వేశారు. బిసి సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య పూలే సేవలను వివరించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారత సాధించేందుకు, సామాజిక అసమానతలు రూపుమాపేందుకు పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని పిఎసి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, గౌరవాధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి ఆనంద్, జనసైనికులు పాల్గొన్నారు. పుత్తూరులో టిడిపి అధ్యక్షులు గంజి మాధవయ్య, నగరి నియోజకవర్గ టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కరుణాయాదవ్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. కోటలో ఎంపిడిఓ భవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. పాకాల అంబేద్కర్ భవన్ అధ్యక్షులు ఆనందయ్య ఆధ్వర్యంలో జరిగింది. నాయుడుపేటలో మున్సిపల్ ఛైర్మన్ దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలేకు నివాళి అర్పించారు. చంద్రగిరిలో సర్పంచి సుధాయాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. పాకాల మండలంలోని మొగరాల పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోపి ఆధ్వర్యంలో లైన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ రామయ్య సహకారంతో కార్యక్రమం జరిగింది. పెళ్లకూరులో ఎంపిపి పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్‌పిటిసి ఎన్.ప్రిస్కిల్లా, ఎంపిడిఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. బాలాయపల్లిలో మాజీ సర్పంచి తనయులు యనమల చెంచుకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.



సిపిఎం ఆధ్వర్యంలో..

ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో..

జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు ఆయన మంగళవారం కొత్తపల్లి సచివాలయం పరిధిలో ఆనేపూడి పంచాయతీలో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేసిన పలు అభివృద్ధి పథకాల కరపత్రాలను ఇంటింటికీ అందిస్తూ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్టు బోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు రమేష్, ఆనేపూడి సర్పంచ్, సీఐ సోమయ్య, ఎస్సై తిరుమల రావు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని సచివాలయం-1 పరిధిలో మంగళవారం వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జగిరిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. రాబేయే ఎన్నికల్లోనూ వైసీపీని ఆదరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బొప్పన సోమశేఖర్, ఎస్సై పురుషోత్తం రెడ్డి , తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ డీఈ మధుసూదన్, ఎంఈవో రవి, సీడీపీవో దేవ కుమారి, ఏపీఎం స్వర్ణలత, ఏపీవో లోకమ్మ, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, నాయకులు శ్యాంప్రసాద్ రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, బాలయ్య, శరవణ, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: కాటూరు పంచాయతీలో మంగళవారం ఉదయం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని జే.సీ.యస్ కన్వీనర్ జయచంద్ర నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మండలంలోని కాటూరు గ్రామ సచివాలయంలో నాయకులు, వాలంటీర్లు, గృహసారథులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వాలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. వైసీపీ సీనియర్ నాయకులు మణినాయుడు, జొన్నల గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, కాటూరు ఎంపీటీసీ రవి, మండల ఎస్ఎస్ఎల్ కన్వీనర్ కంచన, పుత్తూరు గురవయ్య, అశోక్, మురళీ, అనిత, వాలంటీర్లు పాల్గొన్నారు.

కోట : టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు, దళారులు చెప్పిన వాళ్లకే పథకాలు వచ్చేవని.. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సులకు తావులేదని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కోట పట్టణ పరిధిలో ముమ్మరంగా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వ వైఫల్యాలు వివరించి వారి అనుమతితో ఇంటింటికీ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అంటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోట సర్పంచ్ వెంకటరమణమ్మ, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్, ఎంపీటీసీ షేక్ మొబీన్ బాషా, ఉపసర్పంచ్ భాస్కర్, అద్దాల శివకుమార్, గూడూరు కిరణ్‌కుమార్, టింకర్ రవి, వివేక్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకాడు: రావిగుంటపాలెం పంచాయతీ పరిధిలోని గృహ సారథులు, వాలంటీర్లతో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రతిఒక్కరికీ వివరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కల్లూరు సర్పంచి దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, సుధాకర్ నాయుడు, నాగరాజు, సీనా రెడ్డి, వెంకటాద్రి, ప్రదీప్ రెడ్డి, నగేష్ ,రమేష్, రవి పాల్గొన్నారు.

గ్రామాల్లో జీవనోపాధి పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి-కోట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు జీవనోపాధి కల్పించడానికే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఏర్పాటు చేసినట్లు గూడలి ఉప సర్పంచ్ విజయసారథిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉపాధి హామీ పనుల్లో భాగంగా మట్టిని పూడిక తీసే పనులను ప్రారంభించారు. ఉపాధి కూలీలకు కావాల్సిన మౌలిక వసతులు సౌకర్యవంతంగా ఉండేలా ఫీల్డ్ అసిస్టెంట్ సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండల తీవ్రత అత్యధికంగా ఉన్నందున తాగడానికి నీటి సదుపాయం ఎండేలా విజయసారథిరెడ్డి ఏర్పాటు చేశారు. కూలీలకు 100 రోజులు పని వేతనం కల్పించాలని అయన తెలిపారు.

యువగళం పాదయాత్రలో భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో నగరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గాలి బానుప్రకాష్ పాల్గొన్నారు. నారా లోకేష్‌తో కలిసి నడిచారు.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి హరదీప్ సింగ్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి

దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న మంత్రి కుటుంబ సభ్యులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన కల్పిద్దాం..!

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రజలకు తెలియజేసి అర్హులైన వారిని గుర్తించి

దరఖాస్తులు స్వీకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, గీతాంజలి సూచించారు. మంగళవారం పుత్తూరులో మండలంలోని సచివాలయ మహిళా పోలీసులకు మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ వాత్సల్య పథకంలో అర్హులైన వారికి ప్రతినెలా రూ.4 వేలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈనెల 15 లోపు దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ పర్యవేక్షకులు కృష్ణవేణి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉదయం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 128 మంది గర్భిణులకు వైద్యసేవలు అందించారు. అన్నదానం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి మాధవి, డాక్టర్ దివాకర్, సేవ్ ది చిల్డ్రన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, హెల్త్ సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-కోట: టీడీపీ వ్యవస్థాపకులు డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సాజీ మంజిల్‌లో టీడీపీ తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకులు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని గూడూరు టిడిపి మాజీ శాసనసభ్యులు పాశం.సునీల్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వాకాడు మండలాధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కుంచం దయాకర్, దోసకాయల కష్ణమూర్తి, టిడిపి నాయకులు కోకర్ల మధు యాదవ్, తీగల.సురేష్ బాబు, దారా సురేష్, కందల బాలకష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మా రాష్ట్రానికి నాశనం నువ్వే జగన్'

ప్రజాశక్తి -గూడూరు: రాష్ట్రంలో అస్తవ్యస్త పరిపాలనతో ప్రజలు విసిగిపోతున్నారని.. మా నాశనం నువ్వే జగన్ అంటూ ప్రజలంతా వాపోతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. మన రాష్ట్రానికి ప్రజలపై పన్నుల బాధుడు, రోడ్లన్నీ నాశనానికి 'నువ్వే కారణం జగన్' అంటున్నారని విమర్శించారు. గూడూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'మా నమ్మకం.. నువ్వే జగన్ ' అని ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించడం దారుణమన్నారు. పొదుపు సంఘాల సష్టికర్త చంద్రబాబునాయుడేనన్నారు. ఇప్పటికే వైసీపీ పాలన ప్రజలకు అర్థమైందని..రాబోయే రోజుల్లో జగన్ పాలనకు స్వస్తి పలికి చంద్రన్న పాలనకు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థినులు ఉన్నతమైన అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో విరంచి 2కే 23 రెండు రోజుల జాతీయస్థాయి కల్చరల్ ఫియస్టా కార్యక్రమాన్ని మంగళవారం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థినీల ఆలోచనలకు రూపమే ఈ సాంస్కృతిక, సాంప్రదాయక కళల నిర్వహణ జాతీయ స్థాయి పోటీలని వెల్లడించారు. విద్యార్థినుల్లో దాగివున్న వినూత్న ప్రతిభ పాఠవాలను వెలికి తీయడంలో ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థినులు వివిధ రకాల క్లే కోర్ట్ బ్రిలియంట్ బ్రష్, నత్య, మైమ్ కాంటెస్ట్, రాగ, మెహందీ, రంగోలి వంటి వివిధ పోటీలలో రాణించడం ద్వారా జీవితంలో మానసికంగా ఎంతో పరిపూర్ణత సాధించగలరన్నారు. వర్సిటీ కుల సజీవులు ఆచార్య ఎన్. రజనీ మాట్లాడుతూ విద్యార్థినిలు చదువులలోని ఒత్తిడిని కొంత మేరకు ఉపశమనం కలిగించేందుకు ఈ జాతీయస్థాయి విరంచి పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతికంగా బ్లైండ్ ఆర్ట్స్, జుగార్డ్, స్ప్రింగ్ ఆఫ్ క్లే, టర్న్ అండ్ కోట్, ది బ్రిలియంట్ బ్రష్, నత్యం, రాగా, మైమ్ పోటీలు మెహందీ, స్నాప్ చాట్, రంగోలి, రైట్ టు ఫేమ్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య శ్రీనివాసరావు, వివిధ కళాశాలల డీన్లు, ప్రిన్సిపాల్ లు, ఆధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

గంగమ్మగుడి రోడ్డును వేగవంతం చేయండి

ప్రజాశక్తి తిరుపతి టౌన్: తిరుపతి తాతయ్యగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను మంగళవారం సాయంత్రం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన అధికారులతో మాట్లాడుతూ మే మొదటి వారంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసుకొని వైభవంగా గంగ జాతర ఉత్సవాలు జరుగుతాయని, ఈ జాతరకు అనేక ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారనే విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆలోపు గంగమ్మగుడి మాస్టర్ ప్లాన్ రోడ్డు పూర్తి కావాలన్నారు. గాంధీ విగ్రహం నుండి గ్రూపు థీయేటర్ రోడ్డు చివరి వరకు 60 అడుగులతోనూ, అక్కడి నుండి గంగమ్మగుడి వైపుగా తుడా సర్కిల్ వరకు 40 అడుగుల రోడ్డుగా వెడల్పు చేసే పనులను వేగవంతం చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కుంచించుకు పోయిన రహదారిని విశాలం చేయడం వలన నగర ప్రజలకు, గంగమ్మ జాతర ఉత్సవాల నిర్వహణకు అనుకూలంగా వుంటుందన్నారు. అనంతరం గంగమ్మ ఆలయంలో జరుగుతున్న పనులను

పరిశీలిస్తూ తగు సూచనలు ఎమ్మెల్యే భూమన జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డిఈ దేవిక, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగం, కార్పొరేటర్లు దొడ్డారెడ్డి ప్రవళ్ళికా రెడ్డి, కోటేశ్వరమ్మ, దూది కుమారి, అనీష్, మోహనకష్ణ యాదవ్, హనుమంత నాయక్, బోకం అనీల్, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, తొండమనాటి వెంకటేష్ రెడ్డి, ఉదయ్ వంశీ పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీల భారం టీడీపీదే: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీడీపీ ప్రభుత్వం హయాంలో ట్రూఅప్ ఛార్జీలను ప్రజల నుండి వసూలు చేయబోమని నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, వాటిని బకాయిలుగా వదిలేశారని, ఆ భారాన్ని విద్యుత్ సంస్థలకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెల్లిస్తోందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సిపాయి



సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు టిడిపి ప్రభుత్వం విద్యుత్తు ఉత్పత్తి భారానికి తగినన్ని నిధులు విద్యుత్ సంస్థలకు ఇవ్వలేదని, దీంతో ప్రత్యామ్నాయ మార్గం లేక విద్యుత్ సంస్థలు వేల కోట్ల రూపాయలను అప్పులుగా తీసుకున్నాయన్నారు. నాడు చంద్రబాబు నాయుడు చేసిన తప్పిదమే నేడు ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. బకాయిలు కట్టకపోతే విద్యుత్ సరఫరా ఆపేస్తామని కేంద్ర పవర్ గ్రిడ్ సంస్థలు తీవ్ర నిర్ణయాన్ని కూడా తీసుకున్నాయన్నారు. విద్యుత్ కోతలైన విధించాలి లేక కొనుగోలు దారుల నుండి ఖర్చులు అయినా వసూలు చేయాలనే పరిస్థితులు నడుమ ట్రూ అప్ చార్జీలను విద్యుత్ సంస్థలు వసూలు చేస్తున్నాయన్నారు. తప్పు వారు చేసి వారి తప్పును మోస్తున్న వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేయడం తెలుగుదేశం పార్టీ నాయకులకు తగదన్నారు. ప్రజలపై అదనపు భారాన్ని పడకుండా 2023-24 ఆర్థిక సంవత్సరానికి కూడా విద్యుత్ ఛార్జీలను మాత్రమే వసూలు చేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఇప్పటికే ఆదేశించారన్నారు. విద్యుత్ సంస్థలపై పడే ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

నారా చంద్రబాబునాయుడిని కలిసిన నగరి నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గం ముస్లిం మైనారిటీ నాయకులు విజయవాడ మంగళగిరిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి ఘనంగా సన్మానించారు. ఈ

సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాబోయే ఎన్నికల్లో మైనారిటీ సోదరులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కే.షబ్బర్, నగరి నియోజకవర్గం తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.హమీద్ బాషా, నగరి మీడియా కోఆర్డినేటర్ ఎస్.కరీం అలీ షా, నగరి పట్టణ సెక్రటరీ కరీముల్లా పాల్గొన్నారు.

పక్కాగృహాల పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: పక్కా గృహాల పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండలంలోని నిండలి గ్రామంలోని సచివాలయంలో వాక్యం గ్రామంలో పక్క గహాలు మంజూరైన లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరితగతిన పనులు ప్రారంభిస్తే ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కాపుగున్నరి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన శివ శంకర్ కుటుంబానికి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మాధుసూదన్ రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మతుడి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పిలిపించి పరామర్శించారు. శివశంకర్ కుంటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు చిట్టివేలు జయగోపాల్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కుంభోత్సవానికి 'నైనారు' పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కళ్యాణార్థం మంగళవారం అమ్మవారికి నిర్వహించిన కుంభోత్సవానికి తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలం, జంగాలపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ నైనారు పొన్నారావు కుటుంబం పట్టువస్త్రాలు, గాజులు, పసుపు కుంకుమలను సమర్పించారు. గాజుల తయారీకి ప్రసిద్ధమైన జంగాలపల్లె నుంచి ఆ గ్రామ వాస్తవ్యులైన నైనారు కుటుంబ సభ్యులు ఏటా నిర్వహించే కుంభోత్సవానికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది పొన్నారు కుటుంబ సమేతంగా మేళ తాళాలు, సంప్రదాయ స్వాగతం మధ్య అమ్మవారికి సారె సమర్పించారు. పొన్నారావు కుటుంబం ప్రతి సంవత్సరం కంచి కామాక్షిదేవికి, మధుర మీనాక్షిదేవికి, తిరుచానూరు పద్మావతిదేవికి ఆయా ఉత్సవాల సమయంలో వస్త్రాలు, గాజులను సమర్పిస్తుండటం గమనార్హం. ఆలయ ప్రధానార్చకుడు వీరభద్రయ్యస్వామి, ఏఈవో హరిదాసు, డాక్టర్ నైనారు పద్వి తదితరులు పాల్గొన్నారు.

సవాల్ స్వీకరించలేకనే విమర్శలు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తాను చేసిన సెల్ఫీ సవాళ్లను స్వీకరించే ధైర్యం లేక స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో మంగళవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తన పాదయాత్రలో వెలుగు చూసిన సమస్యలను పరిష్కరించాలంటూ తాను సెల్ఫీ ఛాలెంజ్ లు విసిరితే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వాటిపై స్పందించకుండా బొజ్జల పాలనపై ఆవాకులు, చవాకులు పేలడం హాస్యాస్పదమని మండిపడ్డారు. ఎమ్మెల్యేకి దమ్ము.. ధైర్యం ఉంటే తన సెల్ఫీ ఛాలెంజ్ ను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పంది అడ్డురావడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చంద్రగిరి: పందిని ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు మృతిచెందిన సంఘటన చంద్రగిరి మండలంలోని నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై

సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరుకు చెందిన గణపతి(42) తిరుపతి నుండి చిత్తూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చంద్రగిరి మండలంలోని నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలోని బోడింబాయి వద్ద ఎదురుగా వచ్చిన పందిని తప్పించబోయి అదుపుతప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో పందితోపాటు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: తన ద్విచక్రవాహనం చోరీకి గురైందనిగంగుపల్లి వెంకటేష్ మంగళవారం భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారిస్తున్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులకు మంగళవారం ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకులు రామ్మోహన్ రావు కంటి అద్దాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, ధనుంజయరెడ్డి, వాసు గౌడ్, పాదర్తి ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట దళితుల నిరసన

ప్రజాశక్తి-బాలాయపల్లి: అసైన్‌మెంట్ భూములు భూస్వాములకేనా అంటూ మండలంలోని వాక్యం గ్రామానికి చెందిన దళితులు మంగళవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తాము సాగు చేసుకుంటున్న భూములను ఇతరులకు ఇస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్తతో సంపదను సృష్టించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీమ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూపీసీలను సక్రమంగా నిర్వహించాలని.. సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, కో ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు బీసీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పలువురికి సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జడ్పీటీసీ విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డిలతోపాటు సీడీపీవో దేవకుమారి సమక్షంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, భాగ్యలక్ష్మి, భువన, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో మహిళలకు రక్షణ లేదు

ప్రజాశక్తి -గూడూరు: ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి కళ్యాణిని

అర్ధరాత్రి సమయంలో ఆమె నివాసం వద్ద పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం మహిళా లోకానికే సిగ్గుచేటన్నారు. అధికార పార్టీని అడ్డుపెట్టుకొని మహిళలపై అనేక అత్యాచారాలు, అరాచకాలు కొనసాగిస్తూ అర్ధరాత్రి అని చూడకుండా తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన కళ్యాణిని పోలీసులు స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న మహిళలే ప్రభుత్వానికి ఓటు రూపంలో బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - వెంకటగిరి : మున్సిపల్ పరిధిలో తాగునీటి కొరత లేకుండా చూడాలని తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి కొరత లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, ఛైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.